క్లుప్తంగా

అద్దంకి నాంచారమ్మకు ప్రత్యేక పూజలు



పెదప్రోలు(మోపిదేవి): మండలంలోని పెద ప్రోలు గ్రామంలో అద్దంకి నాంచారమ్మ అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించి 105 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకుడు పెళ్లూరి వెంకటేశ్వరావు అమ్మవారికి ప్రత్యేక అలంకరణచేసి పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గురు ప్రసాద్, కార్యదర్శి కోటేశ్వరావులతోపాటు పెద్ద ఎత్తున గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేటి నుంచి ఇంటింటి సర్వే

పెడన: పట్టణంలో డయేరియాపై ఇంటింటి సర్వే చేయించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే సర్వేలో పట్టణంలోని తొమ్మిది సచివాలయాల పరిధిలో సర్వే చేయిస్తామన్నారు. ఏఎన్‌ఎంతో పాటు మరో ఇద్దరు సభ్యులు ఈ సర్వేలో టీములో ఉంటారని, వీరికి మార్గదర్శకం చేయడానికి తొమ్మిది మంది సిబ్బంది కూడా ఉంటారన్నారు. వీరి సర్వేను పరిశీలించడాకి ప్రత్యేకంగా ముగ్గురు అధికారులను నియమించామని తెలిపారు. సర్వే చేసి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయించాల్సి ఉంటుందని కమిషనర్ పేర్కొన్నారు.

పేరుకుపోతున్న చెత్త



పెడన: పురపాలక సంఘ పరిధిలో చెత్త తొట్టిల వద్ద పశువులు చెత్తను చిందరవందర చేస్తున్నాయి. చెత్త పోగులు ఎత్తకపోవడం కారణంగా సెలవు దినాల్లో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. చెత్త తొట్టిల్లోని చెత్తను బయటకు తీసి తినేందుకు ఏమైనా ఉన్నాయా లేదా పరిశీలించి వాటిని తింటూ మిగిలిన చెత్తను రోడ్డుపై వదిలేస్తున్నాయి. దీంతో అటుగా వెళ్లే ప్రయాణికులు సైతం రోడ్డుపై చెత్తాచెదారం చూసి ఈ దుస్థితి ఏమిటంటూ వాపోతున్నారు. చెత్తను ఎప్పటికప్పుడు ఎత్తి వేస్తే ఈ పరిస్థితి ఉండదని పుర ప్రజలంటున్నారు. మున్సిపల్ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మజ్జిగ పంపిణీ



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శనార్థం రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చే భక్తులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చడం అభినందనీయమని అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ అన్నారు. మోపిదేవి ప్రధాన గుడిసెంటర్‌లో చల్లపల్లి సీఐ నాగప్రసాద్ సహకారంతో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని డీఎస్పీ ప్రారంభించారు. చల్లపల్లి ఎస్‌ఆర్‌వైఎస్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

28న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గూడూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.ప్రేమాన్విత తెలిపారు. ఆ రోజు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ మధుసూదనరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సభ్యులంతా హాజరుకావాల్సిందిగా కోరారు. మండల స్థాయిలో అన్ని శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని పేర్కొన్నారు.

సుబ్బారాయుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. స్వామివారి పుట్టలో పాలు పోయడం మొదలు పాలపొంగళ్లశాల వద్ద నైవేద్యాలు తయారుచేసేందుకు సైతం భక్తులు పోటీపడ్డారు. పలువురు మహిళా భక్తులు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకునేందుకు అధిక సమయం క్యూలలో వేచి ఉండాల్సి వచ్చింది. సహాయ కమిషనర్ నేల సంధ్య చొరవతో ఆలయ కళామండపంలో భక్తులకు అన్నసమారాధన ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు ప్రసాదపు కౌంటర్లను ఏర్పాటు చేశారు.

అక్రమ తూములు
దిగువ భూములకు దక్కని నీరు



కృష్ణాపురం వద్ద షట్టర్ పక్కన ఏర్పాటు చేసిన అక్రమ తూము



నారేపాలెం వద్ద షట్టర్ పక్కన ఏర్పాటు చేసిన అక్రమ తూము

- కోడూరు ప్రధాన కాలువ పొడవునా అక్రమ తూములే
- షట్టర్ల పక్కనే అక్రమ తూముల ఏర్పాటు
- దిగువ పొలాలకు సాగునీరు చేరడం కష్టమే
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

కోడూరు: దివిసీమలోని సముద్ర తీరప్రాంత పొలాలకు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగునీరు అందడం కష్టంగానే కనిపిస్తోంది. కోడూరు–అవనిగడ్డ ప్రధాన పంటకాలువ పొడవునా ఎగువ రైతులు అక్రమ తూములు ఏర్పాటు చేయడంతో దిగువకు సాగునీరు చేరే పరిస్థితి కనిపించడం లేదు.

విధానం ఇదీ..

అవనిగడ్డ నుంచి హంసలదీవి వరకు కాలువ పొడవునా అక్రమ తూములే దర్శనమిస్తున్నాయి. మాచవరం, వి.కొత్తపాలెం, విశ్వనాథపల్లి, నారేపాలెం, జయపురం, కోడూరు, దింటిమెరక ప్రాంతాల్లో ప్రధాన పంట కాలువ నుంచి దిగువ కాలువలకు నీరు వెళ్లేందుకు షట్టర్లు ఏర్పాటు చేశారు. ఎగువ ఉన్న అన్ని షట్టర్లను మూసి ఇరిగేషన్ అధికారులు తీరప్రాంత కాలువలకు సాగునీటిని మళ్లిస్తారు.

22 వేల ఎకరాల ఆయకట్టు..

మండలంలో 39 బ్రాంచ్ కాలువలు ఉండగా ఆయా ఆయకట్టు కింద ఉన్న సుమారు 22 వేల ఎకరాలకు 460 క్యూసెక్కుల సాగునీరు అవసరం ఉంది. ఈ అక్రమ తూముల వల్ల సాగునీరు కూడా వృథా పోతుంది.

షట్టర్ల పక్కనే అక్రమ తూములు..

గతంలో జరిగిన డెల్టా ఆధునికీకరణ పనుల్లో భాగంగా అవనిగడ్డ నుంచి హంసలదీవి వరకు ప్రధాన పంట కాలువలకు ఈ షట్టర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారు. కాలువ బెడ్ లెవల్ కంటే అనేక ప్రాంతాల్లో షట్టర్లు ఎత్తుగా నిర్మించారు. షట్టర్ల తూములు ఎత్తుగా ఉండడం వల్ల కాలువలో నీరు పూర్తిస్థాయితో ఉంటే కాని బ్రాంచ్ కాలువలకు సాగునీరు వెళ్లని పరిస్థితి. దీంతో ఎగువ రైతులు అన్ని షట్టర్ల పక్కన అక్రమ తూములను ఏర్పాటు చేశారు. కాలువకు గండి కొట్టి ఈ తూములను అమర్చారు. ఈ తూముల వెడల్పు కూడా షట్టర్ల తూముల కంటే ఎక్కువగా ఉంటుంది. దిగువకు నీటిని మళ్లించేందుకు షట్టర్ల లాకులను ఇరిగేషన్ అధికారులు మూసినప్పటికీ ఈ అక్రమ తూము ద్వారా సాగునీటి బ్రాంచ్ కాలువల్లోకి ప్రవహిస్తోంది. ఒక్కొక్క ప్రాంతాల్లో షట్టర్ల పక్కనే రెండు, మూడు అక్రమ తూములను కూడా ఏర్పాటు చేశారు. అవనిగడ్డ నుంచి దిగువ వరకు సుమారు 20 పైగానే అక్రమ తూములు ఉన్నాయి.



జయపురం వద్ద ఏర్పాటు చేసిన రెండు అక్రమ తూములు

కాలువల దిగువకు నీరు చేరడం కష్టమే..

ఎగువ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అక్రమ తూముల వల్ల తీరప్రాంత కాలువలకు సాగునీరు చేరడం కష్టంగానే కనిపిస్తుంది. ప్రతి షట్టర్ పక్కన అక్రమ తూము ఉండడంతో లాకులను కట్టేసినా కూడా సాగునీరు ఈ అక్రమ తూముల నుంచి మళ్లీ అదే బ్రాంచ్ కాలువలోకి వెళ్తుంది.

8 వేల ఎకరాలకు ఇబ్బందే..

దీంతో తీరప్రాంత గ్రామాలైన రామకృష్ణాపురం, ఊటగుండం, బసవానిపాలెం, పాలకాలయతిప్ప, హంసలదీవి, ఉల్లిపాలెం, సాలెంపాలెం, వేణుగోపాలపురం కాలువలకు సాగునీరు అందే పరిస్థితి లేదు. అక్రమ తూముల కారణంగా ప్రతి ఏటా తీరప్రాంత రైతులు సాగునీటి సంక్షోభం ఎదుర్కొనే పరిస్థితి. ఎగువ ప్రాంతాల్లో జూలై, ఆగస్టు నెలల్లోనే వరినాట్లు వేస్తుంటే, తీరప్రాంతాల్లో మాత్రం నవంబర్, డిసెంబర్ వరకు నాట్లు పూర్తికాని పరిస్థితి. ఈ అక్రమ తూముల కారణంగా మండలంలోని సుమారు 8 వేల ఎకరాల్లో పంటసాగు ప్రశ్నార్థకంగా మారింది.

స్పందించని ఇరిగేషన్ అధికారులు..

ప్రధాన పంటకాలువ పొడవునా అక్రమ తూములను రైతులు ఏర్పాటు చేస్తున్నప్పటికీ ఇరిగేషన్ అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమ తూములను తొలగించాల్సిన అధికారులే వాటిని వేసేందుకు ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమ తూములను తొలగించాలని గతంలో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తీరప్రాంత రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే అక్రమ తూముల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని రైతాంగం కోరుతున్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం..



ప్రధాన పంటకాలువలోని షట్టర్ల పక్కన ఏర్పాటు చేసిన అక్రమ తూములపై ఏవిధమైన చర్యలు తీసుకోలేం. కాలువ బెడ్‌లెవల్ కంటే షట్టర్ లెవల్ ఎత్తుగా ఉండడంతో ఈ తూములను గత పదేళ్ల క్రితమే రైతులు ఏర్పాటు చేసుకున్నారు. ఎగువ కాలువలోకి నీరు మళ్లించిన తరువాత ఈ అక్రమ తూములను కట్టేసి దిగువకు సాగునీటిని మళ్లిస్తాం. ఈ ఏడాది ప్రతి ఎకరానికి పూర్తిస్థాయిలో సాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

–రావెళ్ల రవికిరణ్, డీఈ, ఇరిగేషన్

265 మందికి కంటి వైద్య పరీక్షలు

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి (పెదకాకాని) సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 43వ ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చింది. మండ సీతారామయ్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్ మండ వెంకటేశ్వరరావు (బాబు మాస్టారు) ఆర్థిక సౌజన్యంతో స్థానిక మారుతీ విద్యా నికేతన్ ప్రాంగణంలో జరిపిన శిబిరంలో 265 మందికి పరీక్షలు చేయగా 214 మందికి ఐఓఎల్ ఆపరేషన్ (కంటి లోపల అద్దం అమరిక)లకు ఎంపిక చేశారు. ముఖ్యఅతిథిగా హాజరై శిబిరం ప్రారంభించిన దివిసీమ గ్రామీణ యువజన వికాస సమితి చైర్మన్, ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ (రాజా) మాట్లాడుతూ సుదర్శి నిర్వాహకులు తలపెట్టిన కంటి వైద్యసేవలు, నేత్రదాన మోటివేషన్ ఉద్యమం అనిర్వచనీయమని కొనియాడారు. పలువురు మాట్లాడుతూ దాతల ఔదార్యంతో ఇప్పటికి ఏడు వేల మందికి పైగా కంటి పరీక్షలు జరిపించి 5,600 మందికి ఐఓఎల్ శస్త్ర చికిత్సలు ఉచితంగా చేయించడం గొప్ప పరిణామమంటూ సంస్థ కృషిని అభినందించారు. డాక్టర్ యోగిత, డాక్టర్ చింతన్ నేత్ర పరీక్షలు జరిపారు. మహిళానేత తలశిల స్వర్ణలత, సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కనిగంటి నారాయణ, రెడ్‌క్రాస్ జిల్లా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు సింహాద్రి కృష్ణప్రసాద్, పుట్టి శ్రీనివాసరావు, స్థానిక రెడ్‌క్రాస్ చైర్మన్ భోగాది శివవిష్ణువర్ధన్, ఆసుపత్రి క్యాంప్ ఇన్‌చార్జి నాగబాబు, బండ్రెడ్డి హరి, బండ్రెడ్డి మల్లికార్జున్, షేక్ మస్తాన్, జమీలా మస్తాన్, మత్తి శివ తదితరులు పాల్గొన్నారు.



నేత్ర పరీక్షలు చేస్తున్న డాక్టర్లు, సిబ్బంది

సమస్యల పరిష్కారానికి కృషి

అవనిగడ్డ: ఎదురుమొండి దీవుల్లోని నాచుగుంట గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. నాచుగుంట సర్పంచ్ సైకం నాగబాబు ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, యువకులు ఆదివారం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఆయన తనయుడు మండలి వెంకట్రామ్ (రాజా)ని కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎదురుమొండి–నాచుగుంట రహదారి నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. రొయ్యల చెరువుల దిగువున ఉన్న 300 ఎకరాల మాగాణి భూముల రైతులు ఎదుర్కొంటున్న ఉప్పునీటి సమస్య పరిష్కారం కోసం సర్పంచ్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు సైకం దేవరాజ్, నాగరాజుతో పాటు పలువురు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



బుద్ధప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాచుగుంట సర్పంచ్, పెద్దలు

వెద సాగుపై రైతుల ఆసక్తి

పెడన: మండలంలో రైతులు వెద సాగుపై ఆసక్తి చూపుతున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 22 వేల ఎకరాలలో వరి సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటి వరకు సుమారు రెండు వేల ఎకరాలకుపైగా రైతులు విత్తనాలు జల్లి వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. వెద సాగు వల్ల రైతులు ఖర్చు తగ్గించుకునేందుకు యత్నిస్తున్నారు. ఈ పద్ధతి వల్ల రైతుకు ఎకరానికి సుమారు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు ఖర్చులు ఆదా ఆవుతాయని అంచనాతో వెద సాగుపై దృష్టిసారిస్తున్నారు. ప్రస్తుతం కూలీ రేట్లు అధికంగా ఉండటంతో నాట్లు వేసేందుకు, నారు మళ్లు లాగేందుకు తదితర ఖర్చులు తగ్గించుకునే ఆలోచనతో రైతులు ఉన్నారు. వెదసాగు వల్ల దుక్కి దున్ని, రోటోవేటర్‌తో చదును చేయించి విత్తనాలు జల్లుకుని నీరు పెడితే సరిపోతుందని రైతులు పేర్కొంటున్నారు. వెదసాగు కాకుండా దుక్కి దున్ని నారు వేసి, నారు లాగి, నాట్లు వేయించడానికి ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. వెద సాగుకు అయితే సుమారు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు మాత్రమే ఖర్చు ఉంటుందని, కాకపోతే కలుపు అధికంగా ఉండే అవకాశం ఉంటుదని అంటున్నారు. కలుపు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిందేనని రైతులు స్పష్టం చేస్తున్నారు. ఏది ఏమైనా రైతులు వెదసాగుపై దృష్టిసారించారు. గత ఏడాది ఖరీఫ్‌లో కూడా 80 శాతానికి పైగా వెదసాగులోనే రైతులు పంట వేసుకున్నారని వ్యవసాయశాఖాధికారులు తెలిపారు.



గురువిందగుంట సమీపంలో వెదసాగులో విత్తనాలు జల్లుతున్న రైతులు

ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఘనంగా రామలింగేశ్వరుని పుష్పోత్సవం

మచిలీపట్నం టౌన్: నగరంలోని మూడు ఆలయాల్లో గత వారం రోజులుగా జరుగుతున్న వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. నగరంలోని రాబర్ట్సన్‌పేటలో వేంచేసి ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి, శ్రీ రంగనాయకస్వామి, జగన్నాథపురంలోని జగన్నాథస్వామి వార్ల బ్రహ్మోత్సవాలు గత వారం రోజులుగా కన్నుల పండువగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా శ్రీ రామలింగేశ్వరునికి ఆదివారం శ్రీ పుష్పోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూకంటి వెంకటరెడ్డి, సునీత దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో రాత్రి నిర్వహించిన భక్తి సంగీత విభావరి భక్తుల్ని అమితంగా ఆకట్టుకుంది. గాయనీగాయకులు ఆలపించిన పలు భక్తి గీతాలు భక్తుల్ని భక్తిపారవశ్యంలో ఓలలాడించాయి. జగన్నాథపురంలోని జగన్నాథస్వామి పవళింపు సేవ భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో సోమవారం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు ఆదివారం తెలిపారు. సోమవారం మధ్యాహ్నం జరిగే ఈ అన్న సమారాధనకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి అన్న ప్రసాదాన్ని స్వీకరించాలని ఆయన కోరారు.

ముగిసిన కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు



చందనశోభితుడిగా దర్శనమిచ్చిన కల్యాణ వెంకటేశ్వరుడు



అన్నసమారాధనలో భక్తులు

ఏడు వేల మందికి అన్నసమారాధన

కోడూరు: కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. శనివారం రాత్రి కల్యాణ మూర్తులకు పవళింపుసేవను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ప్రత్యేక పల్లకిలో భక్తుల హరినామస్మరణ మధ్య స్వామివార్లకు ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించారు. ఒక్కొక్క ప్రదక్షిణకు ఒక్కో వాయిద్యాన్ని వాయిస్తూ కార్యక్రమాన్ని కనులపండువగా జరిపారు. అనంతరం పుష్ప పరిమళాల నడుమ స్వామివార్లకు శ్రీపుష్పయాగాన్ని నిర్వహించారు. ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని ఆదివారం ఉదయం వెంకన్న మూలమూర్తులకు విశేష అలంకారం చేశారు. చందనశోభితుడిగా కల్యాణ వేంకటేశ్వరుడు దర్శనమిచ్చాడు. అనంతరం ఏడు వేల మందికి మహా అన్నసమారాధనను నిర్వహించారు. దివిసీమలోని అన్ని ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ అన్నసమారాధనలో పాల్గొని భక్తిభావం చాటుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు దుంభాల శ్రీధరాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయగా, కమిటీ అధ్యక్షుడు కోట పద్మావతి వరప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యాహక్కు చట్టం అమలు చేయాలి

గుడివాడ టౌన్: విద్యాహక్కు చట్టం అమలులో భాగంగా విద్యార్థులకు ఆదివారం సెలవు కచ్చితంగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పలు ప్రైవేట్ విద్యా సంస్థల్లో వారు విచారించగా 9, 10 తరగతుల విద్యార్థులకు క్లాసులు నిర్వహిస్తున్నట్లు యాజమాన్యాలు తెలిపాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తరగతులు ఎందుకు నిర్వహిస్తున్నారని ప్రశ్నించగా విద్యాశాఖ అధికారులు తమకు అనుమతి ఇచ్చారనడం ఆశ్చర్యాన్ని కలిగించిందన్నారు. డీఈవో ఈ విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థల్లో పుస్తక వ్యాపారానికి అనుమతులు ఉండబోవని, విద్యా సంస్థలు అధిక ధరలకు పుస్తకాలు కొనుగోలు చేయించి, విద్యార్థులను మోసం చేస్తున్నట్లు ఆరోపించారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎస్.సమీర్, జిల్లా ఉపాధ్యక్షుడు సలీమ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రెండు కేసుల నమోదు

పెడన: మండలంలోని జింజేరు గ్రామానికి చెందిన మోతుకూరి వెంకటేశ్వరరావును అదే గ్రామానికి చెందిన సోగాని శ్రీను, శ్రీను భార్య, మేనల్లుడు కొట్టడంతో ఆదివారం పెడన పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తమ పక్క పొలాల్లో నుంచి వెళ్లొద్దని చెప్పి నువ్వు వెళ్లడం ఏమిటంటూ శ్రీనుతో పాటు మరో ఇద్దరు గొడవ పడి వెంకటేశ్వరావుపై దాడి చేశారు. వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ టి.సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

నందమూరు గుడి వద్ద సంబరాన్ని పురస్కరించుకుని మేళతాళాలు వేసే వారు సమయం అయిందని నిలిపివేయడంతో కుంచే వీరవెంకటేశ్వరరావు, నాగరాజు, రోషిత్ అనే ముగ్గురు పరింకాయల నాగఅయ్యప్పపై దాడి చేశారు. దీంతో అయ్యప్ప మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ అవుట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు పెడన పోలీసులకు తెలిపారు. అయ్యప్ప ఇచ్చిన ఫిర్యాదుతో హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ప్రజా ఫిర్యాదులు-పరిష్కారం

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని, ఇకపై ప్రతి సోమవారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం జరుగుతుందని, నగరపాలక సంస్థ ప్రధాన, జోనల్ కార్యాలయాల్లో కూడా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

గుడివాడ టౌన్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. స్థానిక వాసవీచౌక్ లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో జరిగిన ఈ ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హాజరయ్యారు. నూతన అధ్యక్షుడిగా అన్నపురెడ్డి గోపిరెడ్డి, కార్యదర్శిగా నందమూరి పద్మజ, కోశాధికారిగా గంటా చంద్రశేఖరరావు, ఉపాధ్యక్షుడిగా దండమూడి సీతారామస్వామి, సహాయ కార్యదర్శి సీహెచ్ వెంకట మోహనరావు, 12 మంది కార్యనిర్వాహక సభ్యులతో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా అధ్యక్షుడు పీవీ శేగిరిరావు, దేవస్థానం చైర్మన్ జవ్వాజి గంగరాజు, మున్సిపల్ మాజీ అధ్యక్షుడు లంకదాసరి ప్రసాదరావు, పూర్వ అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి, గూడపాటి వెంకటేశ్వరరావు, గుత్తా రమేష్, మారుతీ ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన పాలకవర్గం

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

మచిలీపట్నం టౌన్: నగరంలోని రామానాయుడుపేటలో ఉన్న బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ నాయకులు బలిదాన్ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయవాది డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బలిదాన్ దివస్‌గా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, పంతం గజేంద్ర, అయోధ్య రాము మాట్లాడుతూ డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ చిన్న వయసులోనే కలకత్తా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా, ఎమ్మెల్యేగా పని చేశారన్నారు. ఎంపీగా ఎన్నికై జాతీయ రాజకీయాలలో ప్రవేశించి, జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వైవీఆర్ పాండురంగారావు, తోట రంగనాథ్, గంట సతీష్, కేవీ రామారావు, వి.రమణ, తిరుమలశెట్టి శంకర్ ప్రొఫెసర్ కనకారావు, కూనపరెడ్డి శ్రీనివాస్, సీహెచ్ మల్లేశ్వరరావు, బాకి విజయ్, జుజ్జూరి ప్రసాద్, బొమ్మిడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఉత్సాహంగా ప్రపంచ ఒలింపిక్ దినోత్సవం

క్రీడాకారులకు సత్కారం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రపంచ ఒలింపిక్ దినోత్సవం పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం విజయవాడలోని దుర్గాఘాట్‌లో అమరావతి బోటింగ్ క్లబ్ క్రూయిజ్‌లో నిర్వహించిన వేడుకలు ఉత్సాహభరితంగా జరిగాయి. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని అధ్యక్షత వహించి మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ, ఆసియా క్రీడలకు రోయింగ్ క్రీడాకారులను పంపామని తెలిపారు. ఔత్సాహిక క్రీడాకారులైన విద్యార్థులకు వారి అభిరుచి మేరకు ఆటల్లో శిక్షణ ఇచ్చి ప్రోత్సహించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు పంపుతున్నామని చెప్పారు. క్రీడాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమన్నారు. ముఖ్య అతిథి ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్‌తో కలిసి జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు బి. నీహారిక (జాతీయ స్థాయి రెజ్లింగ్), వి.గీత (రాష్ట్ర స్థాయి రగ్బీ, రెజ్లింగ్), జాహ్నవి (స్టేట్ మీట్‌లో బాక్సింగ్, నేషనల్స్‌లో సైక్లింగ్), మోహన్ వంశీ (స్టేట్ మీట్‌లో బాక్సింగ్ ప్లేయర్), రోహిత్ కుమార్ (జాతీయ కుస్తీ)లను సత్కరించారు. ఒలింపిక్ బెలూన్లను ఎగురవేశారు. శ్రీరామ్ మాట్లాడుతూ అసోసియేషన్ తరఫున డాక్టర్ తరుణ్ కాకాని క్రీడాకారులకు అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని కొనియాడారు. నాయకులు కోలపల్లి గణేష్, శ్రీధర్, సంఘం నుంచి పవన్, బోస్, సింహాచలం పాల్గొన్నారు.



సత్కారం అందుకున్న క్రీడాకారులతో తరుణ్ కాకాని, శ్రీరామ్ తదితరులు